

# భవానీద్వీపం

-వనం వేంకట వరప్రసాదరావు



**నాలుగువందల సంవత్సరాల కాలపరిధిలో సామాజిక, చారిత్రక వాస్తవాలను, సాహిత్య, ఆధ్యాత్మిక, యోగశాస్త్ర, మంత్ర శాస్త్ర రహస్యాలను కలుపుతూ సాగిన గాథ. చరిత్ర నిర్ధారించిన సత్యాలు, చరిత్రకు అందని రహస్యాలు, చారిత్రక పురుషుల సాహసాలు, కలగలిపి సమన్వయము చేసిన గాథ. తెలియని కొన్ని వాస్తవాలను తెలియజేస్తూ, తెలుసును అనుకుంటున్న కొన్ని 'అపోహలను' దూరం చేస్తూ సాగే కల్పిత సాహసిక గాథ. స్వతంత్ర సమరరంగముతో మొదలుకొని యుద్ధ, జానపద క్రీడల మర్మాలు, సాధకుల గాథలు, త్యాగధనుల చారిత్రక గాథలు కలిసిపోయిన కాల్పనిక గాథ. ఇలానే జరిగింది అని తెలిసిన సత్యాలకు యిలా కూడా జరిగి ఉండవచ్చు అన్న చారిత్రక పరిశీలనను జోడించి, వాస్తవ దూరం కాని ఊహలతో సాగిన పరిశీలనాత్మకమైన కథ. ఒక సాహసిక యోధుడి కథతో మొదలై క్రీ.శ. 1677 నుండి ఆధునిక కాలంవరకూ తరతరాల అంతరాలను, అంతరంగాలను విభిన్న కోణాలనుండి విమర్శించిన గాథ. కొందరికి తెలిసిన కొన్నిటిని, అందరికీ తెలియాల్సిన ఎన్నిటితోనో సమన్వయము చేస్తూ సాగిన వాస్తవ గాథల, చారిత్రక సత్యాల సమ్మేళనమైన కాల్పనిక గాథ!**

## - 70 -

(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

'వెరాడర్' (దేశద్రోహి) అంటూ ఖాండ్రించి ముఖం మీద ఉమ్మేశాడు లూసిఫర్. అవమానంతో కందిన ముఖంతో విసురుగా సమాధానం యివ్వడానికి ప్రయత్నం చేశాడు అంబ్రాస్. పళ్ళు పటపట కొరుకుతూ చేతిలోని తుపాకీని తిరగేసి మడమతో అతని ముఖం మీద బలంగా కొట్టాడు బీల్జిబబ్. పెదవులు చిట్లి, పళ్ళు కదిలిపోయి, నోటివెంట రక్తం వెలువడింది 'అంబ్రాస్'కి.

ముత్తవరంలో పూజ ముగుస్తుండగా వచ్చిన ప్రమాదకరమైన సమాచారం అందుకుని కృష్ణరాయల సూచనలతో, ఆయన అంగరక్షకులు వెంట రాగా హుటాహుటిన బయలుదేరాడు అంబ్రాస్. భార్యా పిల్లలను కృష్ణరాయల సలహా మేరకు ముత్తవరంలోనే ఉండమని బయలుదేరాడు నాగులవంచకు.

అత్యంత సమర్థుడు, విశ్వాసపాత్రుడు ఐన వ్యక్తిగత గూఢచారి సమాచారం మేరకు ఈ రాత్రి రెండవ ఝామున నాగులవంచ దచ్చివారి స్థావరం మీద స్థానికుల తిరుగుబాటు, దాడి జరగబోతున్నది.చుట్టుపక్కల దాదాపు ఇరవై ఊళ్ళనుండి వేలాదిమంది స్త్రీలు, పురుషులు ఆయుధాలు ధరించి దచ్చివారిని చంపడమో, చావడమో రెండే మార్గాలు అన్న లక్ష్యంతో మొండిగా దాడిలో పాల్గొంటున్నారని సమాచారం.

అంబ్రాస్ మీద కసి, ద్వేషం, అనుమానాలతో రగిలిపోతున్న లూసిఫర్, బీల్జిబబ్ అతడి కదలికల మీద నిఘా పెట్టి ఉన్నారు. జగన్నాధపురం డొంకలో తమ అనుచరులతో మాటువేశారు. దారుణమైన దెబ్బతో గుర్రం మీదనుండి పడగొట్టి బందీని చేశారు. గుఱ్ఱాన్ని కూడా పొదలు, చెట్ల మాటున కదలకుండా బంధించారు. ముసి ముసి చీకట్లు ముసురుకున్న సమయంలో మూడే మూడు నిముషాలలో జరిగిపోయింది అంతా. అతడు ముందు వెళుతున్నాడు అనే నమ్మకంతో వేగంగా దాటిపోయారు వెన్నంటి వస్తున్నవాళ్ళు.

'స్థావరం మీద వేల సంఖ్యలో స్థానికులు దాడి చేయబోతున్నారు. ముందు స్థావరానికి వెళ్దాం పదండి. అక్కడ నన్ను ఏమైనా చేసుకోండి' బలహీనమైన కంఠంతో అతి కష్టం మీద మాటలు పూర్తి చేశాడు అంబ్రాస్. ఒక్క నిముషం ముఖాలు చూసుకున్నారు లూసిఫర్, బీల్జిబబ్. మరుక్షణం అనుచరుల్లో యిద్దరికి ఆదేశాలు ఇచ్చాడు లూసిఫర్.

వారు గుర్రాల మీదికి క్షణంలో లంఘించి నాగులవంచ కోట వైపు మరలిస్తుండగా రివ్వున ఎటు నుండో దూసుకువచ్చాయి రెండు బాణాలు. గుర్రాలనెక్కిన వారిడొక్కలలో రెక్కలదాకా నాటుకున్నాయి. గుఱ్ఱాల మీద నుండి పిట్టల్లా నేలకు రాలిపోయారు వాళ్ళు.

ఒక బాణం దూసుకొచ్చి తుపాకీని పట్టుకుని చుట్టూ కలయ జూస్తున్న బీల్జిబబ్ మణికట్టులో దిగబడింది. అంత ఎత్తున గుర్రం మీద నల్లరాతి శిల్పంలా, ఆ మసక చీకటిలో వారి ముందుకు వచ్చింది ఒక ఆకారం. భుజాన అమ్ములపొది, చేతిలో నిలువెత్తు విల్లు, నడుముకు రెండు పక్కలా మూడేసి మూరల పొడవైన విచ్చుకత్తులతో కల్కిలా ఉన్నాడు.

'కృష్ణ రాయలు!' కసిగా ఒక్కొక్క మాటా వత్తి పలుకుతూ పళ్ళు కొరికాడు లూసిఫర్. 'డూడ్ హెమ్' (అతడిని చంపండి') అని అనుచరులకు ఆజ్ఞ ఇస్తూ అంబ్రాస్ గుండెల మీద బలంగా తన్నాడు. అప్పటికే దొంగచాటు

దాడిలో దెబ్బ మీద దెబ్బలతో తీవ్రంగా గాయపడి ఉన్న అంబ్రాస్ ఆ తాపుకు వెనుకకు విరుచుకు పడ్డాడు. నోటివెంట రక్తం కక్కుతూ స్పృహ కోల్పోయాడు.

భయంకరంగా కేకలు పడుతూ కృష్ణరాయల మీదకు దూకారు లూసిఫర్ సైనికులు. కృష్ణ రాయల చేతులలోకి ధనుర్బాణాల స్థానాలలో నడుముకున్న కత్తులు ఎప్పుడు వచ్చాయో, కంటికి కనపడకుండా తిరుగుతున్న వాటి ధాటికి చేతులు, ఎదురు రొమ్ములు తెగి గావు కేకలు పెడుతూ పిట్టల్లా రాలిపోతున్న తన సైనికులను చూసి తుపాకీని ఎత్తి కృష్ణ రాయల గుండెలకేసి గురి పెట్టి కాల్చాడు లూసిఫర్.

ఎత్తైన చెట్టు పైన కొమ్మలలో ఒక విసురైన కదలిక కలిగింది. చెవులు దిబ్బెళ్ళు పడేలా గురకలు పెడుతూ లూసిఫర్ మీదకు దూకింది ఒక ఆకారం. ఆ తాకిడికి తలకిందులైన తుపాకీ నుండి వెలువడ్డ మందుగుండు ఇద్దరు డచ్చి సైనికుల కాళ్ళను ముక్కలు చేసింది.

అంత ఎత్తు నుండి అంత బరువైన ఆకారం నిలువునా మీదకు దూకడంతో గూడలు విరిగి నేలకు కూలాడు లూసిఫర్. అయినా వదిలిపెట్టలేదు ఆ ఆకారం. లూసిఫర్ గుండెల మీద కూర్చుని అతడి మెడను అందుకున్నది. పెనుగులాడుతున్న అతడి మెడను పచ్చి వేప కొమ్మను విరిచినట్టు పెటుక్కున విరిచేసింది. గుండెలు బాదుకుంటూ అరిచింది. ఒక్క గంతులో కృష్ణరాయల గుర్రం మీదకు దూకింది. కృష్ణరాయల వీపు మీద గట్టిగా చరిచింది భయపడకు, నేనున్నాను అన్నట్టు. మరుక్షణం చెట్టు కొమ్మల్లోకి మాయమైంది.

ఆ ఆకారమే నాగులవంచ మామిడితోటలో చెట్ల మీద పొంచి ఉండి డచ్చి వారి మీద దాడికి వేసిన ప్రణాళికను నిశితంగా గమనించింది. ఆ ఆకారమే పదేళ్ళ క్రితం ముత్తారం మున్నేటి ఒడ్డున సమర్థరాముడి తలను నరకడానికి ప్రయత్నం చేసిన గోల్కొండ బానిస సైనికుడి మెడను ఉట్టి చేతులతోటి విరిచేసింది. ఆ ఆకారమే కృష్ణరాయల వంశాంకురాన్ని అంతం చేయబోయిన మర్మయుద్ధ వీరుడు 'పంక్తి కంఠన్' ప్రాణాలను గాలిలో కలిపేసింది. ఆ ఆకారం సమర్థ రాముడిని నీడలా అనుసరించి సేవించింది ఆయన యిక్కడ ఉన్నన్ని నాళ్ళూ.

తరువాత కనిపించలేదు. ఇప్పుడు ఇలా ప్రత్యక్షమైంది! ఆ ఆకారమే 'రాం బోలా' అని సమర్థ రాముడు పేరు పెట్టుకున్న మహా మర్కటం.

కళ్ళెదురుగా మెడ విరిగి ప్రాణాలు కోల్పోయిన సహచరుడి దుర్దశను చూసి విచక్షణను కోల్పోయాడు బీల్జిబబ్. తన మణికట్టులో దిగిన బాణాన్ని ఊడ పెరికాడు. రక్తం చిమ్ముతుండగా రెండు చేతులతో ఆ బాణాన్ని పట్టుకుని పైకెత్తాడు. పక్కన స్పృహ కోల్పోయి పడి ఉన్న అంబ్రాస్ గుండెల్లోకి బలంగా దించాడు. ఇక దయ చూప తలుచుకోలేదు కృష్ణరాయలు. కన్ను మూసి తెరిచేలోగా కృష్ణరాయల కత్తి విసురుకు బంతిలా ఎగిరిపడింది బీల్జిబబ్ తల. ధారలుగా రక్తం చిమ్ముతూ నేలకు వాలింది అతడి మొండెం.

ఆ సరికి కృష్ణరాయల ధాటికి నేలకూలి పొర్లుతున్నారు సగం మంది లూసిఫర్ సైనికులు. తమ నాయకుడికి పట్టిన గతిని చూసి గావుకేకలు పెడుతూ చీకట్లలో కలిసి పారిపోయారు మిగిలిన వారు. నడుముకు వ్రేలాడుతున్న శంఖాన్ని పూరించాడు కృష్ణరాయలు.

అప్పటికి నాగులవంచ పొలిమేరలలోకి చేరుకున్నారు అంబ్రాస్ రక్షణకోసం బయలుదేరిన కృష్ణరాయల అంగరక్షకులు.  దిక్కులు పిక్కటిల్లేలా రేగిన ఆ శంఖనాదం చెవినబడిన మరుక్షణం ఏదో ఆపద వాటిల్లింది అని అర్థం అయింది వారికి. గుర్రాలను వెనక్కు మరల్చి వాయువేగంతో కృష్ణరాయల వద్దకు చేరుకున్నారు అర ఘడియలో.

లూసిఫర్, బీల్జిబబ్ శవాలను, తీవ్రంగా గాయపడిన 'అంబ్రాస్'ను గుర్రాల మీదకు ఎక్కించారు. ఇతర సైనికులను కూడా కోటకు చేర్చే ఏర్పాటు చేయమని పురమాయించి తన గుర్రం మీద కృష్ణరాయలు కదులుతుండగా భయంకరమైన మోతతో కంపించిపోయింది ఆ ప్రాంతమంతా. ఆకాశానికి అంటినట్టు ఎగిసిపడిన మంటల వేడిమి ఇంత దూరానికి తమ శరీరాలకు సోకి ఒక్క క్షణం  నివ్వెర పోయారు కృష్ణరాయలు, ఆయన అంగరక్షకులు. నాగులవంచ కోట నేలమట్టం అయ్యింది అని గ్రహించాడు కృష్ణరాయలు. వేగంగా నాగులవంచ వైపు దూకించాడు తన గుర్రాన్ని.

★★★★★★★★★★★★★★★★

'ఏనాడైనా మిమ్మల్ని, మీ ఆడవాళ్ళని అవమానించామా? హింస తిరుగుబాటును రేపుతుంది. తిరుగుబాటు హింసాత్మకం అవుతుంది. మీ హింసలను సహించీ సహించీ ఓపిక కోల్పోయిన గొర్రెల లాంటి అమాయక పల్లెప్రజలు సింహాలైతే దాని ఫలితం ఇలానే ఉంటుంది' దిక్కులు పిక్కటిల్లేలా కృష్ణరాయల గొంతు మోగింది. ప్రతి మాటనూ డచ్చిలోకి అనువదించి చెబుతున్నాడు దుబాసీ దామోదర శర్మ.

నాలుగవ ఝాము చెరిసగానికి వచ్చింది. కోట గోడలు, నివాసాలూ యింకా తగలబడుతూనే ఉన్నాయి. అక్కడక్కడా పొగలు రేగుతున్నాయి. తెలతెలవారుతున్న వెలుగులో కనుచూపుమేరా తెగిన శరీర అవయవాలతో, రక్తంతో, కాలిపోయిన మొండాలతో భీతావహంగా ఉన్నది.

వేలాదిమంది ప్రజల మధ్యన డచ్చి స్థావర ప్రధానాధికారి, ఉప ప్రధానాధికారి, బతికున్న మూడు వందలమంది సైనికులు కూలబడి ఉన్నారు. రెండు ఘడియలలో కృష్ణరాయల ఆదేశాల మేరకు, నాగులవంచ ప్రజల సంతోషం మేరకు, నాగులు ఆధ్వర్యంలో చకచకా ఏర్పాట్లు జరిగిపోయాయి.

డచ్చివారి దస్తావేజులు అన్నీ తగలబెట్టారు. రైతుల భూములు రైతులకు దక్కాయి. ధ్వంసం కాకుండా మిగిలిన విలువైన వస్తువులు తీసుకుని, ప్రాణాలతో ఉన్న డచ్చి స్త్రీ పురుషులు, పిల్లలు అందరూ రెండువందల బండ్ల మీద మచిలీపట్నం స్థావరానికి చేరుకోవడం కోసం ఏర్పాట్లు జరిగాయి.

కేవలం అంబ్రాస్ లాంటి ఉత్తముడి కారణంగా మిగిలినవారినైనా ప్రాణాలతో వెనక్కు పంపడం జరుగుతున్నదని స్పష్టం చేశాడు కృష్ణరాయలు. గోల్కొండ నవాబుల ప్రతినిధిగా, స్నేహపాత్రుడైన అంబ్రాస్ ప్రాణ రక్షణ తనకు అత్యంత ముఖ్యమని నొక్కి చెప్పాడు.

గాయాల నుండి తేరుకున్న తరువాత, గోల్కొండ సైనికుల రక్షణలో అంబ్రాస్ సకుటుంబంగా మచిలీపట్టణానికి చేరుకుంటాడని చెప్పి బండ్లను కదిలించండి అని ఆజ్ఞాపించాడు కృష్ణరాయలు. వేలాదిమంది నాగులవంచ ప్రజల హర్షధ్వానాలతో నాగులవంచ ఆకాశం చిల్లులు పడింది ఆ వేకువలో.

(కొనసాగింపు వచ్చే సంచికలో...)

COMMENTS